ప్రజాశక్తి

శనివారం 21 జూన్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

యోగా ఘట్టానికి సాగర తీరం ముస్తాబు



బీచ్ రోడ్డులో సిద్ధమైన యోగా ప్రధాన వేదిక

- గిన్నిస్ రికార్డు లక్ష్యంగా 5 లక్షల మందితో యోగాభ్యాసన
- ప్రధాని, గవర్నర్, ముఖ్యమంత్రి తదితరుల హాజరు
- ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

అంతర్జాతీయ యోగా దినోత్సవ మహా ప్రదర్శనకు విశాఖ సాగరతీరం సిద్ధమైంది. గిన్నిస్ రికార్డే లక్ష్యంగా గత నెల 21న యోగాంధ్ర కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టి నెల రోజులపాటు విస్తృత ప్రచారం చేపట్టి తుది అంకానికి చేరువైంది. దీనిలో భాగంగానే విశాఖ నుంచి భోగాపురం వరకూ ఉన్న తీర ప్రాంతంలో సుమారు 5 లక్షల మందితో శనివారం యోగా ప్రదర్శన నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మెగా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చే జనమంతా మిగతా 2లో..



విన్యాసాల కోసం ఏర్పాటు చేసిన నౌకలు



విశాఖకు చేరుకున్న ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు

ప్రధానికి ఘన స్వాగతం

శనివారం ఉదయం జరిగే యోగా వేడుకల్లో పాల్గొనేందుకు శుక్రవారం సాయంత్రానికే విశాఖకు ప్రధాని మోడీ చేరుకున్నారు. ఆయనకు ఐఎన్ఎస్ డేగాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖమంత్రి నారా లోకేష్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి స్వాగతం పలికారు. శనివారం ఉదయం 6.25కి ఆర్కే బీచ్‌లోని ప్రధాన వేదిక వద్దకు ప్రధాని వస్తారు. 6.30 నుంచి 7.45 వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. ప్రధానితో పాటు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ సహా రాష్ట్ర ప్రముఖులంతా పాల్గొంటారు.

'యోగా'కు బస్సుల మళ్లింపుతో ఇక్కట్లు

▶ వార్త 2లో..

కెజిహెచ్‌లో వైద్య సిబ్బందికి కరోనా టెస్టులు

▶ వార్త 2లో..

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్

▶ వార్త 7లో..



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన యోగా చేపట్టిన కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ యోగాతో నిరసన

వార్త మెయిన్‌లో..

లాజిస్టిక్ రంగంపై దృష్టి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం లాజిస్టిక్ రంగం అభివృద్ధిపై దృష్టి సారించిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి.జనార్ధన్ రెడ్డి అన్నారు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సిఐఐ) ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నోవాటల్ హోటల్ వేదికగా పోర్టులు, లాజిస్టిక్స్‌పై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు ద్వారా 82.62 మిలియన్ టన్నుల ఎగుమతులు, దిగుమతులు జరగడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో లాజిస్టిక్ వ్యవస్థ అభివృద్ధికి 1,040 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్ డి.సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని మారిటైమ్ వ్యవస్థ ఆరు ఆపరేషన్ పోర్టుల ద్వారా అతివేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కాకినాడ విశాఖపట్నం నుండి కీలక ప్రదేశాల్లో మల్టీ మోడల్

భవిష్యత్తులో పలు అభివృద్ధి చర్యలు : మంత్రి జనార్ధన్ రెడ్డి

లాజిస్టిక్ పార్కులను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోందన్నారు. విశాఖ పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మారిటైం, పర్యావరణ వ్యవస్థ అభివృద్ధికి అనువైన ప్రదేశమన్నారు. విశాఖను మారిటైం హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్న ఓడరేవులలో కేవలం 50 శాతం మాత్రమే వినియోగంలో ఉన్నాయని, వీటిని మరింత వినియోగంలోకి తేవాలని అన్నారు. మారిటైమ్ అంటే కేవలం పోర్టు మాత్రమే కాదని ఓడలు, వాటి నిర్మాణం, వాణిజ్యం వంటి ఇతర అంశాలు మిళితమై ఉంటాయని అన్నారు. పెట్టుబడులు ఆకర్షణతో పాటు ఉద్యోగ కల్పనపై దృష్టి సారించాన్నారు. కార్యక్రమంలో భాగంగా జరిగిన ప్యానెల్ డిస్కషన్‌లో పలువురు సభ్యులు మాట్లాడుతూ మధ్య ఆసియా దేశాలలో నెలకొన్న యుద్ధ వాతావరణం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

యోగా ఘట్టానికి సాగర తీరం ముస్తాబు

భాగస్వాములు కానున్నారు.

భారీ ఏర్పాట్లు

యోగా డేకు భారీ ఏర్పాట్లు చేశారు. బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి భోగాపురం వరకూ సుమారు 30 కిలోమీటర్ల మేర యోగాభ్యాస ప్రదర్శన చేపట్టనున్న క్రమంలో మొత్తం 326 కంపార్టుమెంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో కంపార్ట్‌మెంట్‌కు గెజిటెడ్ స్థాయి అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌లో యోగా శిక్షకులు, ముగ్గురు ప్రదర్శకులు, పది మంది వాలంటీర్లు, ఒక ఎఎన్ఎం, ఆశా వర్కర్, పోలీసు అధికారి, గిన్నిస్ రికార్డు నమోదు కోసం కంపార్ట్‌మెంట్‌కు 10 మంది చొప్పున మొత్తం 4,600 మంది ప్రతినిధులు, ఒక ఫుడ్ ఇన్‌ఛార్జి, ఇద్దరు సూపర్‌వైజర్లు, పారిశుధ్య పర్యవేక్షకులు, నలుగురు పారిశుధ్య పనివారు ఉంటారు. యోగా ప్రదర్శకులు 1,438 మంది, శిక్షకులు 907 మంది ఈ కంపార్ట్‌మెంట్లలో సిద్ధంగా ఉంటారు. మొత్తం 4,280 మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ముందుజాగ్రత్త చర్యగా 35 మంది పాములు పట్టేవారితో పాటు పెద్ద సంఖ్యలో గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. పర్యవేక్షణకు డిప్యూటీ కలెక్టర్లతో పాటు అఖిల భారత అధికారులు సైతం బాధ్యత తీసుకున్నారు.

ప్రతి కంపార్ట్‌మెంట్‌లో తాగునీరు, 100 మందికి ఒకటి చొప్పున మరుగుదొడ్డు, స్ట్రెచర్, ఫస్ట్ ఎయిడ్ కిట్, స్నాక్స్ బాక్సులు సిద్ధంగా ఉంటాయి. ప్రదర్శనలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ యోగా మేట్, టీ షర్ట్ పంపిణీ చేస్తారు. యోగా ప్రదర్శన అనంతరం సాధకులు వీటిని తీసుకెళ్లిపోవచ్చు. కంపార్ట్‌మెంట్లో ప్రవేశించడానికి, బయటకు వెళ్లేందుకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేశారు. అందరికీ కనిపించే విధంగా ఎల్ఇడి స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. కొన్ని ప్రదేశాల్లో విష పురుగులు చేరకుండా మూడుసార్లు క్రిమిసంహారక మందులను పిచికారీ చేసి, కంపార్ట్‌మెంట్లను సిద్ధం చేశారు. అవసరమైన అత్యవసర మందులు, 104 వాహనాలతో పాటు ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక ఐదు పడకల ఆసుపత్రిని సిద్ధం చేశారు. మొత్తం 326 వైఫై పాయింట్స్, 335 ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అధికారులను, ప్రజలను వేదికల వద్దకు తరలించడానికి మొత్తం 9995 వాహనాలను వినియోగిస్తున్నారు. వీటిలో 7,295 బస్సులు, 2,500 ఆటోలు, 200 మేక్సీ క్యాబ్‌లు ఉన్నాయి. మొత్తం 75 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. అభ్యాసకులను ఏ కంపార్ట్‌మెంట్ వద్ద దించారో, అక్కడే వారిని తిరిగి వాహనంలోకి ఎక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌కు బస్సులను సైతం మ్యాపింగ్ చేశారు. మొత్తం 10,000 మంది పోలీసులు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు.

18 క్రీడా మైదానాల్లో ప్రదర్శనలు

సాగర తీరంతో పాటుగా మరో 18 క్రీడా మైదానాల్లో కూడా యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎయు మైదానం, చినగదిలి గోల్ఫ్ క్లబ్, పిఎం పాలెం క్రికెట్ స్టేడియం, కొమ్మాది స్టేడియం, ఫోర్ట్ స్టేడియం, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం తదితర 18 క్రీడా మైదానాలు, మరో 30 అదనపు ప్రాంతాల్లో కూడా యోగా ప్రదర్శనలు నిర్వహిస్తారు.

లాజిస్టిక్ రంగంపై దృష్టి

కారణంగా ముడి చమురు ధరలు పెరిగి పోర్టులపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని తెలిపారు. కాకినాడ ప్రాంతంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్స్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో సిఐఐ ఆంధ్రప్రదేశ్ పోర్ట్స్, లాజిస్టిక్స్ ప్యానెల్ కన్వీనర్ డాక్టర్ జి.సాంబశివరావు, సిఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ జి.మురళీకృష్ణ, సిఐఐ విశాఖపట్నం చైర్మన్ డివిఎస్ నారాయణ రాజు, విశాఖపట్నం ప్రతినిధి వి.ఎం.మౌళి తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో వైద్య సిబ్బందికి కరోనా టెస్టులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో వైద్య సిబ్బందికి కరోనా టెస్టులు నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమానికి వస్తున్న ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌లో వెళ్లేందుకు టీమ్‌లను అధికారులు సిద్ధం చేసిన సందర్భంలో టీములో ఎంపికైన 890 మంది వైద్యులకు శుక్రవారం కెజిహెచ్‌లో కరోనా టెస్టులు చేపట్టారు. పరీక్షల తర్వాతే ట్రయల్‌కు వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో వీటిని చేపట్టినట్లు తెలుస్తోంది. ఎంపికైన వైద్యులలో కొంతమందికి కరోనా నిర్ధారణ కావడంతో ప్రత్యామ్నాయ బృందాలను పెద్దాసుపత్రి అధికారులు సిద్ధం చేసినట్లు జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని కెజిహెచ్ అధికారులు వెల్లడించారు.

కులం పేరిట దూషించిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దొండపర్తి జంక్షన్ సమీపంలో మిరాజ్ సినిమాహాల్లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేస్తున్న గిరిజన మహిళలను, కులం పేరుతో తిట్టి, అవమానించిన జ్యోతి, వెంకటేష్‌పై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనులు, మైనార్టీలపైన దాడులు పెరిగిపోయాయన్నారు. సాక్షాత్తూ సిఎం చంద్రబాబు నియోజకవర్గంలో మహిళను చెట్టుకి కట్టేసిన సంఘటనే ఇందుకు ఉదాహరణ అన్నారు. జ్యోతి,వెంకటేష్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబజోన్ నాయకులు ఎం. సుబ్బారావు, కర్రి చంద్రశేఖర్, తొలగించిన కార్మికులు పాల్గొన్నారు.

'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఈ నెల 23వ తేదీన జరిగే 'యువత పోరు పోస్టర్' ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం మద్దిలపాలెంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు ఆధ్వర్యంలో జరిగింది. విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఉరుకూటి చందు అధ్యక్షతన నిర్వహించారు.

'యోగా'కు బస్సుల మళ్లింపుతో ఇక్కట్లు

గంటల తరబడి రోడ్లపైనే నిరీక్షించిన ప్రయాణికులు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని ప్రభుత్వం



తగరపువలస జంక్షన్ బస్‌స్టాప్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విశాఖ నగరంలో శనివారం ఉదయం జరగనున్న యోగాంధ్రకు జనాన్ని సమీకరించే క్రమంలో పెద్ద సంఖ్యలో బస్సులను అటుగా మళ్లించడంతో సాధారణ ప్రయాణికులు శుక్రవారం ఇబ్బందులు పడ్డారు. సాయంత్రానికి అవి తీవ్రమయ్యాయి. యోగా డే వేడుకలకు భారీగా విద్యార్థులను తరలించేందుకు ప్రభుత్వం పూనుకుంది. సాధారణ ప్రజలను తరలించడం కంటే పిల్లల తరలింపు సులభంగా ఉంటుందని అధికార యంత్రాంగం వీరిని లక్ష్యంగా ఎంచుకుంది. ప్రభుత్వ మెప్పు పొందడానికి కలెక్టర్ విజయకృష్ణన్, కొంతమంది ఎమ్మెల్యేలు చూపిన ఉత్సాహం, పారిశ్రామిక ప్రాంతంలో ప్రమాదాలు సంభవించిన ప్పుడుగానీ, ప్రమాదాల నివారణపైగానీ చేయలేదు. నక్కపల్లి, ఎస్ఎఐబి నిర్వాసితుల సమస్యలపై శ్రద్ధచూపని మంత్రి వంగలపూడి అనిత, సుందరపు విజయ్‌కుమార్ యోగాకు అత్యధిక సమయం వెచ్చించారు. కార్మికులను ఆ బస్సుల్లో తరలించే బాధ్యతను పరిశ్రమాధిపతులకు అధికారులు అప్పగించారు. అచ్యుతాపురం, నక్కపల్లి, పరవాడ ఫార్మా, ఇతర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు 25 వేల మందిని బస్సుల్లో యోగాకు యాజమానులు పంపించారు. తమ హక్కులపై జరుగుతున్న దాడులపై కొద్ది నిమిషాలు కార్మికులు నిరసన తెలపడానికి అంగీకరించని యాజమానులు ప్రభుత్వాల నుంచి మరిన్ని రాయితీలు పొందేందుకు అత్యంత విధేయత ప్రదర్శిస్తున్నారు.

జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం ఆర్టీసీ డిపోల్లోని 210 బస్సుల్లో 140 బస్సులు యోగాంధ్రకు జనాల తరలింపునకు కేటాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. శుక్రవారం ఉదయం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు బస్సులను అనేక రూట్లలో ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులు, విశాఖపట్నం, అనకాపల్లి తిరిగే బస్సుల సంఖ్యను భారీగా తగ్గించారు. శుక్రవారం ఉదయమే యోగాంధ్ర కోసం బస్సులను పంపించారు. తిరిగి శనివారం మధ్యాహ్నం బస్సులు డిపోలకు చేరేవరకు ప్రయాణికులకు రవాణా సమస్య వుంటుంది. పాఠశాల, కాలేజీల నుంచి 27,215 మంది విద్యార్థులను బస్సుల్లో తరలించారు. 1200 బస్సులు ఏర్పాటుచేశారు. నగరంలో ప్రధాని మోడీ యోగా చేసిన సమయంలో పాఠశాలల్లో పిల్లలతో యోగా చేయించనున్నారు. ఉన్నత పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల బాలురును శుక్రవారం రాత్రి బస్సుల్లో నగరానికి తరలించారు. మోడల్ స్కూల్స్, కెజిబివి, బాలికల వసతిగృహ పిల్లలను ఆయా వసతి గృహాల నుంచి తరలించడానికి బస్సులు పెట్టారు. విద్యార్థులు వెళ్లే బస్సుల్లో బస్సుకు ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున వుండేలా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ, డిగ్రీ, ఐటిఐ, హాస్టల్, కెజిబివి, మోడల్ స్కూల్స్, పాఠశాల విద్యార్థులు 16 వేల మందికి పైగా యోగాంధ్రలో పాల్గొంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అనకాపల్లి రూరల్ : యోగాంధ్ర ఏర్పాట్లలో పడి కొన్ని రోజులుగా విద్యార్థులకు సరిగా విద్యాబోధన జరగలేదు. ఉపాధ్యాయుల్లో ఎక్కువ మంది ఎంతోకొంత యోగా విధుల్లో ఉన్నారు. ఉద్యోగులు పౌరులకు సేవలు అందించడంలో జాప్యం వహించారు. జన సమీకరణ బాధ్యత వీరిపై పడటమే కారణంగా తెలుస్తోంది. మహిళా ఉద్యోగులైతే చంటి పిల్లలను ఇంటి దగ్గర వదిలేసి యోగాంధ్ర కార్యక్రమానికి వెళ్లాల్సి వచ్చింది. ఇక కార్యక్రమం ముందు రోజు నుంచి విధించిన ట్రాఫిక్ ఆంక్షలు ప్రజలను ఇబ్బందుల్లో పెట్టాయి. గిన్నిస్ రికార్డు కోసం ప్రజలను ఇంతలా ఇబ్బందులకు గురిచేయడం తగదన్న విమర్శలు వినిపించాయి. ఈ కార్యక్రమం ప్రజలలో యోగా పట్ల అవగాహన పెంపు కంటే, రాజకీయ నేతల మెప్పు కోసమేనన్న అభిప్రాయాలు వెల్లువెత్తాయి.

తగరపువలస : విశాఖ బీచ్‌రోడ్డులో యోగా దినోత్సవానికి జనసమీకరణకు మెజార్టీ ఆర్‌టిసి బస్సులన్నీ తరలిపోవడంతో శుక్రవారం పరిమిత సంఖ్యలో బస్సులు తిరిగాయి. దీంతో స్థానిక జంక్షన్, శివాలయం వద్ద, వై జంక్షన్ బస్‌బే బస్‌స్టాప్ వద్ద ప్రయాణికులకు గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు. బస్‌పాసులున్న వివిధ ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగులు చేసేవారంతా ఇబ్బందులు పడ్డారు. తప్పని సరి పరిస్థితుల్లో చాలా మంది ఆటోల్లో వెళ్లారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపో నుంచి రోజూ విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి తగరపువలసకు 222 నంబర్ బస్ సర్వీసులు 20, అనకాపల్లి నుంచి తగర పువలస 888 నంబర్ గల బస్సులు 3, పెందుర్తి నుంచి 55 టి నంబర్ బస్సులు 4, కూర్మన్నపాలెం నుంచి ఇక్కడకు వచ్చే 111 నెంబరు బస్సులు రెండు నిత్యం అనేక ట్రిప్పులు తిరుగుతూ ప్రయాణికుల అవసరాలను తీరుస్తుండగా, శుక్రవారం కేవలం 222 సర్వీసు నాలుగైదు ట్రిప్పులు మాత్రమే తిరిగిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. మద్దిలపాలెం వెళ్లేందుకు బస్సు కోసం గంటన్నరకు పైగా వేచి చూసినా రాకపోకవడంతో ఆటోలో వెళ్లాల్సి వచ్చిందని తగరపువలసకు చెందిన వెంకటలక్ష్మి అనే మహిళ వాపోయింది. పోనీ రూట్ బస్సుల్లో వెళదామంటే అవి కూడా పరిమిత సంఖ్యలో రావడం, కిక్కిరిసి ఉండడంతో ఆగకుండా వెళ్లిపోయేపరిస్థితి ఉందని ప్రయాణికులు వాపోయారు.

పద్మనాభం: యోగాంధ్ర పుణ్యమాని కనీస సంఖ్యలోనైనా బస్సులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. పద్మనాభం మీదుగా సింహాచలం నుంచి విజయనగరానికి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు తిరిగే పరిస్థితి ఉండగా, శుక్రవారం గంటలు వేచిచూసినా బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు అవస్థల పాలయ్యారు.

వారంలోగా తాగునీటి సమస్య పరిష్కారం

- సిఐటియు ఆందోళనతో దిగొచ్చిన అధికారులు


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వన్‌టౌన్ 38వ వార్డు బుక్కా వీధిలో తాగునీటి సమస్యను వారం రోజుల్లోగా పరిష్కరిస్తామని జివిఎంసి నీటిపారుదల విభాగం డిఈ, ఎఈ శుక్రవారం బుక్కావీధికి వచ్చి, ఆందోళన చేస్తున్న స్థానికులు, సిఐటియు నాయకులను కలిసి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ బుక్కావీధిలో కుళాయిల్లో మురుగునీరు వస్తోందని, ఆ నీరు తాగితే పలువురు డయేరియా వంటి వ్యాధులకు గురి అయ్యారని చెప్పారు. సమస్యపై గతంలో స్థానికులతో కలిసి ఆందోళన నిర్వహించామని, కలెక్టర్‌కు వినతిపత్రం అందించామని అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో, రెండు రోజుల క్రితం మరోసారి ఆందోళన చేసినా అధికారులు స్పందించలేదన్నారు. దీంతో బీచ్‌రోడ్‌లో యోగా నిర్వహించే నిరసన కార్యక్రమం చేయాలని నిర్ణయించామని తెలిపారు. విషయం తెలియడంతో అధికారులు వచ్చి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే ఎఈ డిఈ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం. సుబ్బారావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఆవిరైన విదేశీ ఉద్యోగం ఆశలు!

- పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు
- నైరాశ్యంతో విషాదాంతంగా ముగిసిన అప్పలరాజు జీవితం

ప్రజాశక్తి-ఆనందపురం : విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేయాలన్న ఆశలు నెరవేరకపోవడంతో మనస్తాపంతో ఒక యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆనందపురం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివి.

మండలంలోని వెల్లంకి పంచాయతీ కేంద్రంలో పైడా వెంకటలక్ష్మి, సూరిబాబు దంపతులు నివాసముంటున్నారు. అయితే వెంకటలక్ష్మి వెల్లంకిలో వంట పనులు చేస్తుండగా, సూరిబాబు బొడ్డపాలెం ప్లైవుడ్‌ కంపెనీలో పనిచేస్తున్నారు. పెద్దకుమారుడు పైడా అప్పలరాజు (24) డిగ్రీ పూర్తి చేసి వెల్డింగ్‌ పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటుండగా, చిన్న కుమారుడు చంద్రశేఖర్‌ కూడా ఇంటర్మీడియట్‌ పూర్తయ్యాక అదే పనిలో ఉన్నాడు.

దుబాయ్‌ వెళ్లాలన్న ఆశతో అప్పలరాజు గతేడాది ఢిల్లీ వెళ్లి ఇంటర్వ్యూకు హాజరై విజయవంతమయ్యాడు. వీసా ఖర్చుల కోసం రూ.లక్షన్న ఖర్చుచేసినా, నిర్వాహకుల నుంచి ఎటువంటి సమాచారం రాకపోవడంతో విదేశీ పర్యటన రద్దయ్యింది. దీంతో తీవ్ర నిరాశకు గురైన అప్పలరాజు, అప్పట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినా, ప్రాణాలతో బయటపడ్డాడు.

తాజాగా ఈనెల 15న, మళ్లీ దుబాయ్‌ ప్రయాణానికి ప్రయత్నిస్తూ రూ.1లక్ష కావాలని తల్లిదండ్రులను కోరాడు. అయితే ఇద్దరూ కలిసి వైజాగ్‌లోనే పని చేయండి అంటూ తండ్రి సూరిబాబు మందలించడంతో అప్పలరాజు మనస్తాపానికి గురయ్యాడు. అప్పటి నుంచి భోజనం చేయడం మానేశాడు 19న ..గురువారం ఉదయం తల్లి వెంకటలక్ష్మిని బైక్‌పై ఆమె పనిచేసే కంపెనీ దగ్గర వదిలి, ఇంటికి వచ్చిన అప్పలరాజు, గదిలోకి వెళ్లి తలుపులు మూసుకున్నాడు. మధ్యాహ్నం రెండు గంటలైనా బయటకు రాకపోవడంతో తలుపు తెరిచి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. మంచంపై వాంతులు, పక్కనే గడ్డి మందు బాటిల్‌ కనిపించడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఉండి, 108 వాహనానికి సమాచారమిచ్చి కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో గురువారం అర్ధరాత్రి 12:30 గంటలకు మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. అందిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గంట్యాడ సంతోష్‌ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తును ఎఎస్‌ఐ జి.సత్తిబాబుకు అప్పగించారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించగా, శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.



పైడా అప్పలరాజు (ఫైల్‌ఫోటో)

నేడు తాగునీటి సరఫరా వేళల్లో మార్పు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ వేడుకలో అన్నివర్గాల ప్రజలతోపాటు మహిళలు పాల్గొంటున్న నేపథ్యంలో ఎవరికీ ఇబ్బంది లేకుండా ఉండేందుకు శనివారం ఉదయం 11 గంటల తర్వాత జివిఎంసి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని ఒకటో జోన్‌ తాగు నీటి సరఫరా విభాగం సహాయక ఇంజనీరు జి సురేష్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్‌గా వచ్చే వేళల్లో కాకుండా, శనివారం ఒక్కరోజున మాత్రమే ఒకటో జోన్‌ పరిధిలోని నాలుగు వార్డుల్లో తాగునీటి సరఫరా వేళల్లో మార్పులను ప్రజలు గమనించాలని కోరారు.

23న ఎస్‌ఒఎస్‌ చిల్డ్రన్స్‌ డే

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌ఒఎస్‌ చిల్డ్రన్స్‌ విలేజ్‌ డే వేడుకలను ఈ నెల 23న విలేజ్‌ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు విలేజ్‌ డైరెక్టర్‌ సి మణికండన్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్‌, ప్రత్యేక అతిథిగా స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, గౌరవ అతిథిగా విశాఖ డిఎల్‌ఎస్‌ఎ కార్యదర్శి సన్యాసినాయుడు, ప్రత్యేక ఆహ్వానితులుగా చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ చైర్‌పర్సన్‌ ఎంఆర్‌ఎల్‌ రాధ పాల్గొంటారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు

పలుచోట్ల యోగాసనాలు



యోగాసనాలు వేస్తున్న కనకమహాలక్ష్మి బ్యాంకు ఉద్యోగులు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్‌ :యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా వస్తుందని కనకమహాలక్ష్మి కోపరేటివ్‌ బ్యాంకు చైర్మన్‌ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శుక్రవారం కనకమహాలక్ష్మి కోఆపరేటివ్‌ బ్యాంక్‌ అక్కయ్యపాలెం ప్రధాన కార్యాలయంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత యువత యోగాపై అవగాహన పెంచుకుని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. తొలుత యోగా శిక్షకులు చిట్టూరి శ్రావణిచే యోగాలోని మెలకువలను నేర్పించారు. కార్యక్రమంలో బ్యాంక్‌ డైరెక్టర్లు బి.నాగేశ్వరరావు, కొమ్మారెడ్డి సదాశివరావు, ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిషోర్‌, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలని కోరుతూ 33, 37 వార్డుల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ పాల్గొన్నారు. ముందుగా 33 వార్డులో కుమ్మరివీధి సచివాలయం ఉద్యోగులు, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి హాజరయ్యారు. జనసేన ఫ్లోర్‌లీడర్‌ భీశెట్టి వసంతలక్ష్మి, వార్డు టిడిపి అధ్యక్షులు సత్యనారాయణ, సీనియర్‌ నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమలదేవి పలువురు నాయకులు పాల్గొన్నారు. 37వ వార్డ్‌ గాంధీబొమ్మ జంక్షన్‌ వద్ద నిర్వహించిన యోగాంధ్ర జనసమీకరణలో ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గానికి కేటాయించిన బాక్సులలో మాత్రమే చేరుకునేలా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పాయింట్‌ ఆఫ్‌ కాంట్రాక్టు శివప్రసాద్‌ రెడ్డి సచివాలయ సిబ్బంది, ఆర్‌పిలు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం జగదాంబ జంక్షన్‌ వద్ద ఎస్‌ఆర్‌ షాపింగ్‌ మాల్‌ వెనుక ఫుడ్‌ స్ట్రీట్‌లో శ్రీ లక్ష్మీ ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్‌ను ఎమ్మెల్యే వంశీ శ్రీనివాస్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో 30 కార్పొరేటర్‌ అప్పల రత్నం,పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురం సెయింట్‌ ఆన్స్‌ కళాశాలలో యోగాంధ్రలో భాగంగా కళాశాల హిందీ అధ్యాపకురాలు, యోగా శిక్షకులు ఎ.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థినులు యోగాసనాలు వేశారు. వీరిని ఎన్‌ఎస్‌ఎస్‌ జిల్లా నోడల్‌ అధికారి ఇపిఎస్‌.భాగ్యలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థినులు ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

ఆనందపురం : యోగా దినోత్సవానికి సొంత వాహనాల్లో వెళ్లేందుకు అనుమతి లేదని, ప్రభుత్వం సమకూర్చిన వాహనాల్లోనే రావాలని ఎంపిడిఒ డాక్టర్‌ వి.జానకి సూచించారు. మండలం నుంచి 160బస్సుల్లో ఎనిమిది వేల మందిని తరలించనున్నట్లు తెలిపారు. ఉదయం 3గంటలకే అందరూ బయలుదేరి, ఐదు గంటల్లోగా నిర్దేశించిన యోగా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ క్యూఆర్‌ కోడ్‌తో కూడిన ఐడి కార్డు, టీషర్ట్‌ పంపిణీ చేస్తామని, అనంతరం స్నాక్స్‌, అరటి పండ్లు, బిస్కెట్లు అందజేస్తామన్నారు. యోగా అనంతరం వచ్చిన బస్సుల్లోనే తిరిగి ఇళ్లకు వెళ్లాలని సూచించారు.

తగరపువలస :యోగాంధ్రను జయప్రదం చేయాలని కోరుతూ రెండోవార్డు ఆదర్శనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. టిడిపి ఎస్‌టి విభాగం నాయకులు చెట్టి అశోక్‌ చక్రవర్తి, స్థానిక మహిళలు పాల్గొన్నారు. స్థానిక అవంతి ఇంజనీరింగ్‌ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కళాశాల ప్రిన్సిపల్‌ బి మురళీకృష్ణ, డైరెక్టర్‌ ఎ చంద్రశేఖర్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారి షరీఫ్‌ పాల్గొన్నారు



ములగాడలో యోగాసనాలు వేస్తున్న సెయింట్‌ ఆన్స్‌ విద్యార్థినులు

సీతమ్మధార : ప్రపంచ యోగ దినోత్సవంలో ప్రజలందరూ భాగస్వామి కావాలని నవోదయ జూనియర్‌ కాలేజ్‌ కరస్పాండెంట్‌ భీశెట్టి రాము పిలుపునిచ్చారు. శుక్రవారం సీతమ్మధార కాలేజీ ఆవరణలో విద్యార్థులతో యోగసనాలు వేయించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఉదయం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు ఇందులో పాల్గొని యోగాసనాలు వేశారు. యోగా మాస్టర్‌ ట్రైనీలు యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్‌ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ దాకారపు నాగేశ్వరిదేవి, తహసీల్దార్‌ ఎం.లక్ష్మి, ఇంచార్జ్‌ ఎంపీడీఓ విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్‌ పెదిరెడ్ల మాణిక్యం, మాజీ ఎంపీటీసీ గొన్నాబత్తుల శ్రీనివాస్‌, మాజీ జడ్పిటిసిలు వియ్యపు అప్పారావు, గోకివాడ కోటేశ్వరరావు, కూటమి నేతలు దొండా సన్యాసిరావు, నరేష్‌, గిరిబాబు, సుంకర లక్ష్మీ, దొంకిన అప్పలనాయుడు, కోట సత్యనారాయణ, మలిరెడ్డి బుజ్జి పాల్గొన్నారు.

యోగా ఏర్పాట్లను పరిశీలించిన సిఎస్‌

ఎంవిపి కాలనీ: విశాఖ సముద్రతీరంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె. విజయానంద్‌ శుక్రవారం పరిశీలించారు. ప్రధాన వేదిక, కంపార్ట్‌మెంట్‌లను, లోపల చేసిన ఏర్పాట్లను, ఎల్‌ఇడి స్క్రీన్‌, సౌండ్‌ సిస్టమ్‌లను పరిశీలించి ఏర్పాట్లపై ప్రధాన వేదిక ఇన్‌ఛార్జ్‌, వీఎంఆర్‌డిఎ కమిషనర్‌ కెఎస్‌ విశ్వనాథన్‌ అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సమన్వయంతో పనిచేయాలని సీఎస్‌ సూచించారు ఏర్పాట్లన్నీ పకడ్బందీగా నిర్వహించాలని ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో వైద్యారోగ్యశాఖ కమిషనర్‌ వీరపాండ్యన్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తగరపువలసలో యోగాపై అవగాహన ర్యాలీ

1.50 లక్షల ప్రదేశాల్లో యోగా ప్రదర్శన

ఎంవిపి కాలనీ: రాష్ట్రంలోని లక్షన్నర ప్రదేశాల్లో శనివారం యోగా నిర్వహణకు ఏర్పాట్లు చేశామని యోగాంధ్ర నోడల్‌ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు చెప్పారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, విశాఖపట్నం బీచ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు పాల్గొంటారన్నారు.. సముద్ర తీరంలో యోగా దినోత్సవ వేడుకలకు సుమారు పదివేల వాహనాల్లో వివిధ ప్రాంతాల ప్రజలు వచ్చి పాల్గొంటారన్నారు. సూరత్‌లో లక్షన్నర మందితో జరిగిన యోగా ప్రదర్శన రికార్డును అధిగమించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎయు గ్రౌండ్‌లో 25వేల మంది గిరిజనవిద్యార్థులతో 15 నిమిషాల పాటు సూర్య నమస్కారాలు చేయడం ద్వారా మరో కొత్త రికార్డును సష్టించామని కృష్ణబాబు తెలిపారు.

రక్షణరంగ పరిశోధనల్లో ఎయు భాగస్వామ్యం ఉండాలి



శ్రీనివాసరాజును సత్కరిస్తున్న ఎయు ప్రతినిధులు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : రక్షణరంగ పరిశోధనలలో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆచార్యుల భాగస్వామ్యం ఉండాలని ఎయు వైస్‌ఛాన్స్‌లర్‌ ఆచార్య జి.పి.రాజశేఖర్‌ అన్నారు. శుక్రవారం ఎయు అమెరికన్‌ కార్నర్‌లో ఎయు రీసెర్చ్‌ డెవలప్‌మెంట్‌ విభాగం, ఎస్‌ఐడిఎం సంయుక్తంగా నిర్వహించిన 'ఆప్టిమైజింగ్‌ డిఫెన్స్‌ ఇండస్ట్రీస్‌ డెవలప్‌మెంట్‌ క్యాపబిలిటీస్‌ విత్‌ కొలాబరేషన్‌ ఆఫ్‌ ఎక్స్‌పర్ట్స్‌' సదస్సులో మాట్లాడుతూ, పిహెచ్‌డి పరిశోధకులకు ఒక అధ్యయన అంశంగా రక్షణ సంబంధసమస్యను అందించాలని సూచించారు. ఈ పరిశోధన ప్రాజెక్టుల్లో యూజీ, పిజి, పిహెచ్‌డి విద్యార్థులను భాగస్వాములను చేసే దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఆసక్తి కలిగిన ఆచార్యులతో ఒక గ్రూపును తయారుచేస్తామన్నారు. డిఆర్‌డిఒ సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసే విధంగా కృషిచేస్తామన్నారు.

సొసైటీ ఆఫ్‌ ఇండియన్‌ డిఫెన్స్‌ మాన్యుఫ్యాక్చరర్స్‌ ఎపి శాఖ చైర్మన్‌ శ్రీనివాసరాజు మాట్లాడుతూ రక్షణరంగానికి సంబంధించిన ప్రాజెక్టులను భారతీయసంస్థలకే ఇవ్వాలనే బలమైన ప్రతిపాదన ఉందన్నారు. రక్షణమంత్రిత్వశాఖ నుంచి లభిస్తున్న సహకారాన్ని వివరించారు. అభివృద్ధి చేసే సాంకేతికతను విభిన్న రంగాలలో ఉపయోగిస్తున్న విధానాలను వివరించారు. దేశీయంగా సాంకేతికతను అభివృద్ధి చేసే ప్రక్రియలో ఎయు ఆచార్యులు, నిపుణుల సహకారం తమకు కావాలని కోరారు. తద్వారా సంపదను సృష్టించడం, నూతన జ్ఞానాన్ని పెంపొందించడం, వికసిత్‌ భారత్‌ 2047 లక్ష్యాలను సాకారం చేయడం సాధ్యపడుతుందన్నారు. క్వాంటం కంప్యూటింగ్‌ రంగం, పునరుత్పాదక ఇంధన వనరులు, ఫెర్మార్మింగ్‌ కంప్యూటింగ్‌ రంగాల్లో పరిశోధనలకు విస్తృత అవకాశం ఉందన్నారు. నేడు భారత్‌ శాటిలైట్లకు ప్రత్యామ్నాయాలను అన్వేషించే దిశగా పనిచేస్తోందని తెలిపారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంతో తాము కలిసి పనిచేయడానికిసిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సాంకేతిక అంశాలతోపాటు న్యాయ మేనేజ్‌మెంట్‌ విభాగాల్లో తమకు నిపుణుల అవసరం గణనీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎయు తరఫున శ్రీనివాసరాజును సత్కరించారు. కార్యక్రమంలో రీసెర్చ్‌ డెవలప్‌మెంట్‌ విభాగం డీన్‌ ఆచార్య వి.వల్లికుమారి, అసోసియేట్‌ డీన్‌ ఆచార్య పివివి. సత్యనారాయణ, ప్రాజెక్ట్‌అండ్‌ ఐపిఆర్‌ విభాగం ప్రొఫెసర్‌ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

పల్లా సింహాచలానికి ఘననివాళి



నివాళులర్పిస్తున్న టిఎన్‌టియుసి నేతలు

ప్రజాశక్తి- ములగాడ: హిందుస్థాన్ షిప్‌యార్డ్ గేటు ఆవరణలో మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం సంతాప సభ టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో శుక్రవారంనిర్వహించారు. ముందుగా సింహాచలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు అనంతరం టిఎన్‌టియుసి నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం షిప్‌యార్డుకు చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్మికుల సమస్యలపై వారికి అండగా ఉండి పోరాడారని కొనియాడారు. ఆయన లేనిలోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి, ఇతర యూనియన్ల నేతలు ఉరుకూటి మురళి, గొంప చిన్నాజీ, రమణ, రాము, మహేష్, నూకరాజు, అరుణ్‌కుమార్, కన్నబాబు, కూర్మారావు, వై శ్రీనివాసరావు, జగదీష్ పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి-మధురవాడ :జివిఎంసి ఏడోవార్డు మానం అంజనేయులు కాలనీలో లలితా త్రిపుర సుందరి సమేత మహాకామేశ్వరస్వామి దేవాలయం వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించి, స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. స్థానికులతోపాటు పరిసర కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పిల్లా వెంకటరావు, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాశి అప్పలరాజు, కాలనీ అధ్యక్షులు నాయుడు బాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారికి ఆత్మీయ సత్కారం



రామ్మోహనరావును సత్కరిస్తున్న విష్ణురాం

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఈ నెల 30 న ఉద్యోగ విరమణ చేయనున్న ఉక్కు ఇన్స్ట్రుమెంటేషన్ డిజిఎం హెచ్. రామ్మోహనరావు దొరకు శుక్రవారం ఆత్మీయ సత్కారం లభించింది. ఇన్స్ట్రుమెంటేషన్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో ఆ విభాగాధిపతి విష్ణురాం ముఖ్య అతిథిగా పాల్గొని, రామ్మోహనరావు దొరను సత్కరించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి, దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. అనంతరం మాట్లాడుతూ ఉక్కు కర్మాగార ప్రగతికి రామ్మోహనరావు విశేషసేవలు అందించారని కొనియాడారు.కార్యక్రమంలో కార్మిక నాయకులు, ఉద్యోగులు వైవి.రమణ, లక్ష్మినారాయణ హనుమంతరావు, ప్రసాద్, ఎంఆర్ నాగేశ్వరరావు, జె.శ్రీనివాస్, వై.నాగేశ్వరరావు అధికారులు ఎస్-ఎల్‌వి ఆనంద్, శాస్త్రి పాల్గొన్నారు

సామాజిక సేవలో డివైఎఫ్ఐ

- కొండవాలు ప్రాంతంలో స్వచ్ఛందంగా హ్యాండ్ రెయిలింగ్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేసి అభినందించిన క్రాంతినగర్ వాసులు

ప్రజాశక్తి -ములగాడ : మూడున్నర దశాబ్ధాలుగా కొండవాలు ప్రాంతం క్రాంతినగర్‌లో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ, మరో శాశ్వత ప్రజోపయోగ పనిని చేపట్టి ప్రజల మన్ననలు, ప్రశంసలు అందుకుంది. కొండపైనున్న నివాసాల వద్దకు వెళ్లేందుకు సరైన రహదారి, రక్షణ లేక ఇబ్బందులకు గురై ప్రమాదాల బారిన పడుతున్న స్థానికులకు, కొండమార్గంలో శాశ్వత రెయిలింగ్‌ను స్వచ్ఛందంగా శ్రమదానంతో ఏర్పాటు చేశారు. అధికారులు, నేతలకు ఏళ్లతరబడి మొరబెట్టుకున్నా జరగని పనిని, స్వచ్ఛందంగా చేసి చూపించి శభాష్ అనిపించుకున్నారు. జివిఎంసి 63వ వార్డు క్రాంతినగర్ కొండవాలు ప్రాంతంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన హ్యాండ్ రెయిలింగ్‌ను సమాఖ్య మల్కాపురం జోన్ కార్యదర్శి ఎస్.వాసు శుక్రవారం ప్రారంభించారు. హ్యాండ్ రైలింగ్‌ను శ్రమదానంతో ఏర్పాటు చేసిన క్రాంతినగర్ డివైఎఫ్ఐ కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రాంతినగర్‌లో కొండవాలు ప్రాంతంలో సమస్యలపై నిర్వహించిన సర్వేలో కొండవాలు ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు, రక్షణగోడలు, రెయిలింగ్‌పై ప్రజల నుంచి అభ్యర్థనలు రాగా, వాటిని స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. వాటి పరిష్కారానికి పలుమార్లు డివైఎఫ్ఐ తరపున ప్రాతినిధ్యం చేసినా ఎటువంటి స్పందన లేకపోవడంతో డివైఎఫ్ఐ, క్రాంతినగర్ కమిటీ ముందుకొచ్చి కొండవాలు మార్గంలో హ్యాండ్ రెయిలింగ్ ఏర్పాటు చేసిందన్నారు. కొండవాలుల్లో నివాసాలకు చేరుకునేందుకు రక్షణ లేని పరిస్థితుల్లో పిల్లలు, వృద్ధులు, మహిళలు జారిపడి గాయాల పాలౌతున్న పరిస్థితుల్లో, వారికి అండగా శాశ్వత హ్యాండ్ రెయిలింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమస్యల పరిష్కారానికి డివైఎఫ్ఐ చొరవ, కృషికి స్థానికుల నుంచి హర్షం వ్యక్తం కావడం ఆనందంగా ఉందన్నారు.

డివైఎఫ్ఐ క్రాంతినగర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సవీన్, ఎం.కిరణ్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ కమిటీ సభ్యులతో స్థానిక సమస్యలపై సర్వే చేపట్టి, గుర్తించిన వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని, దీనికి ప్రజలు సహాయసహకారాలు అందించారన్నారు. భవిష్యత్‌లో ఇదే పంథాలో ప్రజాసమస్యలపై పనిచేస్తామన్నారు. పలువురు స్థానికులు మాట్లాడుతూ, కొండవాలులో నెలకొన్న కష్టాలు, ఇబ్బందులపై వార్డు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నోసార్లు వినతులు, ఫిర్యాదులు చేసినా పట్టించుకోని పరిస్థితుల్లో డివైఎఫ్ఐ యువత దృష్టికితేగా, వారు స్పందించి, హ్యాండ్ రెయిలింగ్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని అభినందించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ సభ్యులు జి.నరేష్ జి. రామకృష్ణ, నగేష్, జి.దాసు, జె.కోటి, ఎస్. నవీన్, ఎస్.నాగేంద్ర, ఎస్.నాని, డి.ప్రేమ్, సిహెచ్. సురేష్, ఎం.మోసి, పి.భాస్కరరావు, ఎస్.తాత బుజ్జి, డి.గణేష్, పి.శ్రీను, ఎస్.రవితేజ, ఎస్.గౌరినాయుడు, జె.రాకేష్ పాల్గొన్నారు.



క్రాంతి నగర్ కొండవాలులో డివైఎఫ్ఐ ఏర్పాటు చేసిన రెయిలింగ్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడం లేదని
ప్రధానితో ప్రకటన చేయించాలి

- తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
- సిఐటియు ఆధ్వర్యాన నిరసన : కరపత్రాల ప్రచారం



కరపత్రాలు పంచుతూ నిరసన ర్యాలీలో సిఐటియు నేతలు

ప్రజాశక్తి- మధురవాడ :విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా, ఉక్కు పరిరక్షణకు ఉద్యమిస్తున్నకాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం అన్యాయమని, తొలగించిన నాలుగువేల పైచిలుకు కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు మద్దిలపాలెం జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కొమ్మాది కూడలి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ అమ్మడం లేదని విశాఖ వస్తున్న ప్రధాని మోడీతో రాష్ట్రంలోని కూటమి ప్రకటన చేయించాలని నినాదాలు చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు, కార్మికులను మభ్యపెట్టి, మోసపుచ్చుతున్నాయని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాడుతున్న కాంట్రాక్టు కార్మికులపై కక్షగట్టి దఫాలవారీగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారన్నారు. ఇప్పటికే నాలుగు వేలమంది కాంట్రాక్టు కార్మికులకు ఉద్వాసన పలికి రోడ్డు పాల్జేశారని, వారంతా కుటుంబాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి, ప్రజలకు మరీ ముఖ్యంగా కార్మికులకు కూటమి ప్రభుత్వ చేస్తున్న అన్యాయాన్ని అన్ని వర్గాల ప్రజలు ఎండగట్టి, కార్మికులకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ యోగాదినోత్సవానికి 21న విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీతో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో సిఐటియు నాయకులు పేడాడ రాజశేఖర్, టి.తిరుపతి, రాము, కె.కృష్ణ, సింహాచలం పాల్గొన్నారు.

ఐటి హిల్స్‌కు బస్సు సర్వీస్ ప్రారంభం

ప్రజాశక్తి-ఉక్కునగరం : లంకెలపాలెం నుంచి మధురవాడ ఐటి హిల్స్ వరకు విశాఖ స్టీల్‌సిటీ డిపోకు చెందిన ఆర్‌టిసి సిటీ బస్ సర్వీస్‌ను శుక్రవారం కూర్మన్నపాలెంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డి ప్రారంభించారు. అనంతరం కూర్మన్నపాలెంలోని విశాఖ స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా టిఎన్‌టియుసి విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ, 85 వార్డు తెలుగు యువత అధ్యక్షులు బండారు చందు రమేష్ పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు.



బస్ సర్వీస్ ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఇచ్చిన హామీలను
కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, వైసిపి నేతలు ఆరోపించారు. శుక్రవారం ఆరిలోవ కాలనీ వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు.ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 'జగన్ నమ్మకం, చంద్రబాబు మోసం' అంటూ వార్డు వైసిపి నేత సత్యాల వెంకట్ సాగరిక ఆధ్వర్యంలో నిరసన నినాదాలు చేశారు. వైసిపి నాయకులు వనం వరలక్ష్మి, వాసు, కాకర గోవింద్, బాబూరావు, సుబ్బారావు, శ్రీను పాల్గొన్నారు.

కూటమి అక్రమ కేసులను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : వైసిపి బలోపేతానికి లీగల్ సెల్ నుండి ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో లీగల్‌సెల్ జిల్లా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైసిపి శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు బాజినాయుడు, లీగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

బార్బిక్యూనేషన్ 'కుక్కడ్ కార్నివాల్' ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలో ప్రముఖ బఫే డైనింగ్ చైన్ బార్బిక్యూ నేషన్ 'కుక్కడ్ కార్నివాల్'ను శుక్రవారం నగరంలోని సిరిపురంలో ప్రారంభించింది. ఈ సందర్భంగా బార్బిక్యూ నేషన్ ఎపి ఆపరేషనల్ హెడ్ నరేష్ నాయుడు ముత్తులూరు మాట్లాడుతూ రుచికరమైన బఫే వంటకాలకు బార్బిక్యూ నేషన్ ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ ఫెస్టివల్ ద్వారా వినియోగదారులకు విభిన్నమైన వంటకాలతో చికెన్ విందును అందించనున్నామని చెప్పారు.

విభజన హామీలు తీర్చలేని

మోడీ ఏ ముఖం పెట్టుకుని ఆంధ్రాకు వస్తున్నారు?

★ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయనని ప్రధాని ప్రకటన చేయాలి
★ పోలవరం ప్రాజెక్టుపై ప్రశ్నించలేని కూటమి ఎంపీలు
★ బిజెపితో జగన్ అక్రమ పొత్తు
★ పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి-అనకాపల్లి

తిరుపతి సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా కల్పిస్తామని 2014 ఎన్నికల సమయంలో ప్రకటించిన మోడీ 11 సంవత్సరాల అధికారంలో ఉండి కూడా ఎందుకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఎపి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ప్రశ్నించారు. స్థానిక న్యూ కాలనీ రోటరీ కళ్యాణమండపంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మోడీకి యోగాపై ఉన్న శ్రద్ధ ఆంధ్రప్రదేశ్ ప్రజలపై లేదన్నారు. విభజన హామీలు నెరవేర్చలేని మోడీ ఏ ముఖం పెట్టుకొని ఆంధ్రాకు వస్తున్నారని ప్రశ్నించారు. మోడీకి జనసేన, టిడిపి సపోర్టు చేయడం బాధాకరమన్నారు. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి బిజెపితో అక్రమ పొత్తు పెట్టుకున్నారని ఆరోపించారు. 83 వేల మంది పోలవరం నిరాశ్రయులకు ఆర్‌ఎన్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా మోడీ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. రాజధానిని పూర్తిగా కేంద్రం నిధులతో నిర్మించాల్సి ఉందని, కాని నిధులు అప్పుల రూపంలో ఇవ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు. విశాఖ యోగాంధ్రకు వస్తున్న మోడీ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయనని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి, జనసేన, వైసిపి ఎంపీల సహాయంతో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మనుగడ సాగిస్తోందని, ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేయని మోడీని ప్రశ్నించకపోగా ఆయనకు వత్తాసు పలకడం బాధాకరమన్నారు. విభజన హామీలపైనా, రాజ్యాంగ రక్షణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రణాళికతో కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో డిసిసి అధ్యక్షులు మీసాల సుబ్బన్న, అచ్యుతాపురం, పాయకరావుపేట, మాడుగుల, నర్సీపట్నం, అనకాపల్లి అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు తనకాల అనంతరావు, పడాల కొండలరావు, మారుతి చక్రవర్తి, కచ్చాల చినబాబు, మలపురెడ్డి కోటేశ్వరరావు, నాయకులు బవిన్న కోట రాము, కాళ్ళ సత్యనారాయణ, ఆదిమూర్తి, ఆర్అర్ నాయుడు, సేనాపతి రాజు, కట్టమురి నూక అప్పారావు, బోయిన భానుమూర్తి యాదవ్, కెవి మాణిక్యం, బుద్ధ కిషోర్, బి.బాల మురళి పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు షర్మిల



మాట్లాడుతున్న న్యాయమూర్తి నిఖిత

సబ్ జైల్‌లో అసౌకర్యం లేకుండా చూడాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

సబ్ జైల్లో నిందితులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని మూడో అదనపు మెజిస్ట్రేట్ జడ్జి నిఖిత సెంగర్ అన్నారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అనకాపల్లి సబ్ జైల్‌ను ఆమె పరిశీలించారు. నిందితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయ సహాయం ఉచితంగా కావాలంటే అవకాశం ఇస్తామన్నారు. సబ్ జైల్లో ఉన్న అన్ని గదులను పరిశీలించారు. నిందితులకు పెడుతున్న ఆహారాన్ని పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్ కిరణ్, న్యాయ సహాయకులు సాయిరాం, ఎంఎల్ఎస్‌సి ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపిపి జ్యోతి

రైతులకు వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట

కశింకోటలో ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసిన వరి విత్తనాలను వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు చేతుల మీదుగా శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీను, గ్రామ టిడిపి అధ్యక్షులు తాకాసి కృష్ణ, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని లింగంపేట సచివాలయంలో రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం రైతులకు వరి విత్తనాలు కూటమి నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు మాట్లాడుతూ, రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వ్యవసాయ శాఖ ఆత్మ బిపిటి చిటికెల లక్ష్మి కిషోర్ రైతులకు విత్తనాలు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్ బాబు, కూటమి నాయకులు మరిశా దేవుడు, గ్రామ ఉపసర్పంచ్, జనసేన మండల కమిటీ ఉపాధ్యక్షులు లంక సత్యనారాయణ, పెద్దాడ ప్రసాద్ పాల్గొన్నారు.

నాగేశ్వరరావును సత్కరించిన లోకేష్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విశాఖపట్నం వచ్చిన సందర్భంగా విమానాశ్రయంలో తనను కలిసిన రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావును శాలువాతో సత్కరించారు. నాగేశ్వరరావు అనారోగ్యంతో ఉన్నప్పటికీ పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్నారని లోకేష్ కొనియాడారు.



ప్రగడ నాగేశ్వరరావును సత్కరిస్తున్న మంత్రి లోకేష్

రెవెన్యూ సిబ్బంది నిబద్ధతతో పని చేయాలి

రెవెన్యూ దినోత్సవంలో కలెక్టర్ విజయ కృష్ణన్



రెవెన్యూ దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామ రెవెన్యూ సహాయకుల నుంచి తహశీల్దారు డిప్యూటీ కలెక్టర్ వరకు ప్రతి ఒక్క రెవెన్యూ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్లో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ శాఖ పట్ల ప్రభుత్వానికి, ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు ప్రణాళికతో పనిచేయాలన్నారు. ప్రతి ఉద్యోగి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యాలయ భూ పరిపాలన పర్యవేక్షకులు పివి రత్నం రెవెన్యూ శాఖ పుట్టు పూర్వోత్తరాలు వివరించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది నిబద్ధతతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జిల్లా జేసీ అధ్యక్షులు, కలెక్టర్ కార్యాలయ కోఆర్డినేషన్ విభాగపు పర్యవేక్షకులు ఎస్వీఎస్ నాయుడు, తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరు వద్ద మురుగునీరు నిల్వ

- ఏపుగా పెరిగిన తుప్పలు
- ఇబ్బంది పడుతున్న రైవాడ పాఠశాల విద్యార్థులు



బోరు వద్ద నిలిచిపోయిన మురుగునీరు, ఏపుగా పెరిగిన తుప్పలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని రైవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తాగునీటి కోసం ఆధారపడే చేతిబోరు చుట్టూ మురుగు నీరు నిలిచిపోయి అపరిశుభ్రంగా ఉంది. బోరు వద్ద నీరు తాగే చోటే మురుగు పేరుకుపోయి, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రోజూ స్కూల్‌కు వచ్చే చిన్నారులు ఈ నీటినే తాగుతున్నారు. పక్కనే నిలిచిపోయిన మురుగు నీటి మట్టిలో కాళ్ళు మునిగిలా నిల్చొని దాహం తీర్చుకుంటున్నారు. మురుగుతో కూడిన నీటి ప్రాంతం నుంచి దోమలు, కీటకాలు విపరీతంగా వస్తున్నాయి. ఇటువంటి అపరిశుభ్ర నీటిని తాగితే విద్యార్థులు టైఫాయిడ్, కలరా, వాంతులు, విరేచనాలు వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలు చదువుకోడానికి స్కూల్‌కి పంపుతున్నామని, వ్యాధులతో ఆసుపత్రి చుట్టూ తిరగడానికి కాదని పలువురు ప్రశ్నిస్తున్నారు. పిచ్చి మొక్కలను సైతం తొలగించకపోవడంతో విష సర్పాలు పాఠశాల ప్రాంగణంలో సంచరించే ప్రమాదం ఉంది. స్థానిక అధికారులు, పాఠశాల నిర్వహణ విభాగం ఇప్పటికీ మౌనంగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే పిల్లల జీవితాలు ముప్పులో పడతాయి. రైవాడ పాఠశాలలోని చేతి బోరు వద్ద శుభ్రత చర్యలు తీసుకోవడమే కాక, మురుగు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, బోరు చుట్టూ ప్లాట్‌ఫాం నిర్మించాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు ఉండాలి : ఎంఇఒలు

ప్రజాశక్తి-కశింకోట

ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు ఉండాలని కశింకోట ఎంఇఒలు సురేష్ కుమార్, సూర్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్య పిల్లలకు అందించాలన్నారు. తరగతిలో నిర్దేశించిన పరిమితిలో విద్యార్థులు ఉండాలని సూచించారు. పాఠశాలలు ప్లే గ్రౌండ్, ఆహ్లాదకర వాతావరణంలో ఉండాలన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించుకోవాలని ఆదేశించారు. సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహించరాదని, ప్రభుత్వ సూచనలు మేరకే ఫీజులు వసూలు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని, నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

శ్రీవిష్ణు హాస్పిటల్, సురక్ష హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రామన్నపాలెం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 160 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కీర్తిశేషులు అడిగర్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ముందుగా అప్పలనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. అనంతరం డాక్టర్ అడిగర్ల సుధీర్, డాక్టర్ మౌనిక, డాక్టర్ సందీప్, డాక్టర్ సత్య, డాక్టర్ జగదీష్, డాక్టర్ వెంకట్ రోగులకు జ్వరం, దగ్గు తలనొప్పి, జలుబు, కడుపు నొప్పి, కీళ్ల నొప్పులు వాటికి వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, ఇతర రక్త పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందచేశారు. దంత, దవడ సమస్యలు, మొటిమలు, తామర, దురదలు, కణితలు, పులిపిరి కాయలు, అవాంచిత రోమాలు, మొఖము పైన నల్ల మచ్చలు, జుట్టు రాలిపోవటం, బట్ట బుర్ర, పెనుకొరుకుడు, చుండ్రు వంటి వాటికి పరీక్షలు చేసి మందులు, సలహాలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు బాబు, ఎంపిటిసి లాలం శ్రీను, మాజీ ఎంపిటిసి బాబు, వైసిపి నాయకులు నాయుడుబాబు, క్రైస్ట్ స్కూల్ ప్రతినిధి రెడ్డి గణేష్, ప్రసన్న, సన్ రైజ్ డైగ్నోస్టిక్స్ సోంశేఖర్ పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో మిగులు స్టీట్లలో ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎన్.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని మేఘాద్రిగెడ్డ, సిఓఈ మధురవాడ, నక్కపల్లి, కోణాం, నర్సీపట్నం, తాళ్ళపాలెం, కొక్కిరాపల్లి, నర్సీపట్నం తదితర బాలికల గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్లలో ప్రవేశాల కొరకు ఈ నెల 22న ఆదివారం తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే శ్రీకృష్ణాపురం, దేవరాపల్లి, సబ్బవరం, గొలుగొండ బాలుర గురుకులాల్లో మిగులు సీట్లలో ప్రవేశాల కొరకు ఈ నెల 23న సోమవారం శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసిన వారు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రాతిపదికన నిర్వహించే కౌన్సెలింగ్‌కు ర్యాంక్ కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు బాలుర కొరకు 6304241778 నెంబర్‌ను, బాలికల కొరకు 9704550032 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

6, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి

అనకాపల్లి జిల్లాలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాలు నాలుగు బాలురు, 7 బాలికలు మొత్తం 11 పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయకర్త యన్.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. దేవరాపల్లి, గొలుగొండ, సబ్బవరం, శ్రీకృష్ణాపురం 4 బాలుర గురుకులాల్లో 6వ తరగతిలో ఎస్‌సి -60, బీసీ -6, ఒసి-1, 7వ తరగతిలో ఎస్‌సి-34, బిసి-1, ఒసి-1, 8వ తరగతిలో ఎస్‌సి-24, బిసి1, ఒసి-1, 9వ తరగతిలో ఎస్సి-26, ఒసి-2 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. బాలికలకు సంబంధించి నక్కపల్లి, మేఘాద్రిగెడ్డ, కోనాం, నర్సీపట్నం, తాళ్ళపాలెం, కొక్కిరాపల్లి, సిఓఈ మధురవాడ 7 బాలికల గురుకులాల్లో 6వ తరగతిలో ఎస్‌సి -32, బిసి-4, ఒసి-4. 7వ తరగతిలో ఎస్‌సి-32, ఒసి-1, 8వ తరగతిలో ఎస్‌సి-5, బీసీ-2, 9వ తరగతిలో ఎస్‌సి-9, బిసి-2 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన బాల బాలికలు ఏ పాఠశాలలో ప్రవేశం కోరుకుంటున్నారో ఆయా పాఠశాలలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం జత చేయాలన్నారు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు దరఖాస్తులు సంబంధిత పాఠశాలల్లో సమర్పించాలని కోరారు. ఈ నెల 25న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని, బాలికల ప్రవేశ పరీక్ష తాళ్లపాలెం గురుకుల పాఠశాలలోనూ, బాలుర ప్రవేశ పరీక్ష శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాలలోనూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందుగానే హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా హెల్ప్ లైన్ నెంబర్ 0891-2799641ను సంప్రదించాలని కోరారు.

5వ తరగతిలో ప్రవేశానికి 22న కౌన్సెలింగ్

కశింకోట : బాలికల గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 22న మండలంలోని తాళ్ళపాలెం గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ జి. గ్రేస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ఐదో తరగతి పరీక్ష రాసి సీట్లు రాలేని విద్యార్థులు తమ యొక్క ర్యాంక్ కార్డులను తీసుకొని 22న ఆదివారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చిన్నారావు



ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలంల వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా జి.చిన్నారావు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం నర్సీపట్నం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకులుగా పని చేస్తున్నారు. ఉద్యోగోన్నతిపై ఆయన వడ్డాది కళాశాలకు ప్రిన్సిపల్‌గా వస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న వైవిఎల్.అన్నపూర్ణ శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంకి బదిలీ అయ్యారు. చిన్నారావు ప్రస్తుతం యోగాంధ్ర డ్యూటీలో ఉన్నందున ఈనెల 23న ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా కృషి చేస్తానని, విద్యా ప్రమాణాలు పెంచుతామని చిన్నారావు తెలిపారు.

4,698 వేదికల్లో యోగా దినోత్సవం

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా వ్యాప్తంగా మండల, మున్సిపాలిటీ, వార్డు/ గ్రామ సచివాలయాలు పరిధిలో ముందుగా గుర్తించి నమోదు చేసిన 4,698 వేదికలలో శనివారం ఉదయం 8 లక్షల మంది యోగా కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్‌తో పాటు, డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా యోగాంధ్ర సమన్వయ అధికారి కె.మనోరమ యోగా దినోత్సవం సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఏర్పాట్లు, యోగా ట్రైనర్స్‌కు, యోగా కార్యక్రమంలో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ల పంపిణీ, ఫేజ్-3 యోగా శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకోవడం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ కూలీలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు, సాధారణ ప్రజలను పెద్దఎత్తున భాగస్వామ్యం చేయాలని సూచించారు. జిల్లా యోగాంధ్ర కార్యక్రమానికి 7,72,812, మంది పేర్లను నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

యోగాకు బస్సుల్లో జనం తరలింపు



కోటవురట్ల మండల నుండి బస్సుల్లో బయలుదేరుతున్న జనం

ప్రజాశక్తి-నక్కపల్లి

విశాఖలో శనివారం ఉదయం జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి నక్కపల్లి మండలం నుంచి 59 ప్రత్యేక బస్సుల్లో శుక్రవారం జనాన్ని తరలించారు. 27 బస్సులను పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం, 30 బస్సులు హెటెరో ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల కోసం 2 బస్సులను ఏర్పాటు చేశారు. ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంఈవో కె.నరేశ్, వేంపాడు. ఆయుర్వేద వైద్యాధికారి రఘు, యోగాంధ్ర బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, వెలగా శ్రీను, గింజాల శ్రీను, పల్లా రాంబాబు, కె.కనకారావు, శివ రామకృష్ణ పాల్గొన్నారు.

కోటవురట్ల : విశాఖకు మండల వ్యాప్తంగా 12 బస్సుల్లో 576 మంది వెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, తహసిల్దార్ తిరుమల బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లింగన్న నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు వ్యాచలపు జనార్ధన్, జానకి శ్రీను పాల్గొన్నారు.

మాకవరపాలెం అవంతి కళాశాల నుంచి యోగాంధ్రాకు వెయ్యి మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు కళాశాల నుంచి 19 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పాయకరావుపేట : విశాఖలో యోగాంధ్రకు తెలుగుదేశం పార్టీ మండల ప్రెసిడెంట్ చించలపు ప్రదీప్ (పద్దు), టౌన్ ప్రెసిడెంట్ యాళ్ల వరహాలబాబుల, మాజీ పార్టీ మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో తహశీల్దారు ఆనందరావు, ఎంపిడిఓ జయప్రకాశరావు, సిబ్బంది తరలివెళ్లారు.స్థానిక శ్రీ ప్రకాష్ క్రీడా మైదానంలో విద్యార్థులతో యోగా శిక్షకురాలు లలిత ఆసనాలు వేయించారు.

విశాఖలో యోగా డేకు 220 మంది విద్యార్థులు

దేవరాపల్లి : విశాఖ వేదికగా శనివారం ఉదయం జరగనున్న యోగా డే వేడుకలకు దేవరాపల్లి మండలం నుంచి 220 మంది విద్యార్థులు బయలుదేరినట్లు ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు తెలిపారు. నాలుగు రోజుల పాటు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీసీ వసతి గృహంలో ఈ విద్యార్థులకు యోగా సాధన చేయించారు. జూనియర్ కళాశాల నుంచి 65 మంది, బీసీ హాస్టల్ నుంచి 35 మంది విద్యార్థులు యోగడే వేడుకలకు రెండు బస్సుల్లో పయనమైనట్లు చెప్పారు. అలాగే బేతపూడి కస్తూరిబా గాంధీ పాఠశాల నుంచి 120 మంది విద్యార్థినులు 4 బస్సుల్లో బయలుదేరినట్లు తెలిపారు.

రిక్షా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్న రిక్షా కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అనకాపల్లి రిక్షా కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం రిక్షా కార్మికులతో కలిసి అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం సూపరిండెంటెంట్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలు ఇప్పటికి రిక్షా తొక్కడమే తమ జీవనోపాధిగా కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇటువంటి అసంఘటిత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గురముపల్లి వెంకట్రావు, పసుపులేటి నీలకంఠం, బుర్లు సోమునాయుడు, నూక అప్పారావు, బుర్లు జగ్గారావు, సూర్యనారాయణ, అప్పారావు, నారాయణరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రిక్షా కార్మికులు

యోగా పేరుతో ప్రజాధనం వృథా : సిఐటియు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

యోగా పేరుతో ప్రభుత్వం ప్రజాధనం వృథా చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము అన్నారు. తిమ్మరాజుపేట గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో కూలీలను శుక్రవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్ నిధులు పెంచి ఆరు వారాల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వేతనం చెల్లించాలని, కూలీలకు వేతన స్లిప్పులు, పని ప్రదేశంలో టెంట్, మంచినీరు మెడికల్ కిట్ ఉంచాలని కోరారు. పని చేసే సమయంలో ప్రమాదం సంభవిస్తే ఉచిత వైద్యం అందించాలని, మరణించే వ్యక్తి కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని, ఏడాదికి 200 పని దినాలు, రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొత్త నాయకత్వంపై టిడిపి దృష్టి

-పార్టీకి జవసత్వాలు నింపేందుకు కసరత్తు
-ముందుకొస్తున్న లాలం భరత్, గొంతిన హరీష్

ప్రజాశక్తి - యలమంచిలి :

యలమంచిలి నియోజకవర్గ స్థాయిలో తెలుగుదేశం పార్టీ కొత్త నాయకత్వంపై దృష్టి పెట్టింది. పార్టీకి కొత్త జవసత్వాలు నింపే నాయకత్వం గురించి చర్చ జరుగుతోంది. ఇందులో భాగంగా టిడిపి యువతరం నాయకత్వాన్ని తయారు చేసుకొనే పనిలో పడింది.

ప్రస్తుతం నియోజకవర్గంలో అధిష్టానం సూచనల మేరకు పార్టీ కార్యక్రమాలు చేపట్టినా అవి కార్యాలయాలకే పరిమితమవుతున్నాయి. అంతకు మించి ప్రజల్లోకి దూసుకెళ్లే కార్యక్రమాలేవీ చేపట్టలేకపోవడంతో ఏడాది కాలంలో తెలుగుదేశం బాపుకున్నదేమీ లేదు. తెలుగుదేశం నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావును అనారోగ్యం వేధిస్తుంది. రెండు రోజులు కష్టపడితే మరో రెండు రోజులు హాస్పిటల్‌కి వెళ్లాల్సి వస్తోందని ప్రచారం జరుగుతోంది. సీనియర్ నేత మాజీ ఎంపీ పప్పల చలపతిరావు మృదు స్వభావిగా పేరున్నప్పటికీ వార్ధక్యం వెంటాడుతోంది. ఇదే ఆసరాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తిరుగులేని విధంగా దూకుడు ప్రదర్శిస్తూ ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైసిపి నుండి కిందిస్థాయి నాయకులు జనసేనలో పెద్ద ఎత్తున చేరుతున్నారు. అదే సమయంలో తెలుగుదేశం మాత్రం అధిష్టానానికి తెలియకుండా వైసీపీ నేతలను పార్టీలో చేర్చుకోరాదంటూ నిబంధన విధించింది.



టిడిపిలో చేరిన హరీష్ (ఫైల్‌ఫొటో)

కొత్త తరం రాణించేనా?

ఇటీవల తెలుగుదేశం పార్టీ కొత్త తరం నేతలపై దృష్టి పెట్టింది. 2009లో టిడిపి తరుపున యలమంచిలి నుండి పోటీ చేసి ఓడిపోయిన లాలం భాస్కరరావు, జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ కుమారుడు భరత్ పార్టీ కార్యక్రమాల్లో యాక్టీవ్ అవుతున్నారు. అలాగే 2004లో టిడిపి తరుపున, 2009లో ప్రజారాజ్యం తరుపున యలమంచిలి నుండి పోటీ చేసి ఓటమి చెందిన గొంతిన నాగేశ్వరరావు కుమారుడు హరీష్ ఇటీవల తెలుగుదేశం తీర్థం తీసుకున్నారు. తెలుగుతమ్ముళ్లకు ఇదొక పెద్ద చర్చనీయాంశమైంది.

రానున్న 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల పరిధిలు మారతాయని, కొత్త నియోజకవర్గాలు ఏర్పడతాయని ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగా అచ్యుతాపురం కేంద్రంగా ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు భావిస్తున్నారు. అప్పుడు యలమంచిలి రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాలతో ఏర్పడే నియోజకవర్గంలో జనసేనతో పోటీ లేకుండా యలమంచిలిలో టిడిపి నాయకత్వాన్ని బలోపేతం చేసుకోవడంపై ఆ పార్టీ దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఈ ఇద్దరు నేతల తనయులు లాలం భరత్, గొంతిన హరీష్ ముందుకొస్తున్నట్లు తెలుస్తోంది. యువ నేతల కృషి ఫలించాలంటే వారి పనితనం ప్రజల్లో నిరూపించుకోవాల్సిందే!

పరిహారం చెల్లించే వరకూ పోరాటం

- వంటా వార్పుతో మత్స్యకారుల నిరసన
-మద్దతు పలికిన సిపిఎం



మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని వేంపాడు రెవెన్యూ అమలాపురంలో శ్రీ కనక మహాలక్ష్మి సాగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి చెందిన భూములకు నష్టపరిహారం చెల్లించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సంఘానికి చెందిన మత్స్యకారులు స్పష్టం చేశారు. తమ సంఘానికి లీజుకు ఇచ్చిన 43 ఎకరాల 15 సెంట్లు భూమికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు తలపెట్టిన ఆందోళన రెండవ రోజు శుక్రవారం కూడా కొనసాగింది. మత్స్యకారుల తలపెట్టిన ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ, ఎం రాజేష్ మద్దతు తెలిపి, నిరసనలో పాల్గొన్నారు. తమకు లీజకి ఇచ్చిన భూమికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు వంటా-వార్పుతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు మాట్లాడుతూ, అమలాపురం గ్రామానికి చెందిన శ్రీ కనక మహాలక్ష్మి సాగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి 1994లో ఆనాటి ప్రభుత్వం వేంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్లు 410/4, 417, 418లలో 43 ఎకరాల 15 సెంట్లు భూమి లీజుకు ఇవ్వడం జరిగిందన్నారు. ఆనాటి నుంచి అమలాపురం గ్రామానికి చెందిన మత్స్యకారులు ఆ భూములపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం ఈ భూమిని సేకరించి, బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతుందన్నారు. ఈ భూములకు నష్ట పరిహారం చెల్లించాలని రెవెన్యూ అధికారులను, ఏపిఐఐసి అధికారులను ఇప్పటికే అనేకసార్లు కోరడం జరిగిందని, అయినప్పటికీ నేటి వరకు పరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే ప్రభుత్వం స్పందించి మత్స్యకారుల సొసైటి భూములకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. అమలాపురం మత్స్యకారులు వేట చేసుకుని జీవిస్తున్న ఉప్పుటేరును బల్క్ డ్రగ్స్ పార్క్ నిర్మాణ పనులు చేపట్టడంతో మూడు ప్రాంతాల్లో ప్రస్తుతం మూసివేయడం జరిగిందని, దీని కారణంగా ఉప్పుటేరులో మత్స్యకారులు వేట చేసుకునే అవకాశం లేక ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ , రాష్ట్ర హోం మంత్రి స్పందించి అమలాపురం గ్రామస్తుల సొసైటి భూములకు నష్టపరహారం చెల్లించాలని, ఉప్పుటేరును మూసి వేయడంతో ఉపాధి కోల్పోయిన కారణంగా 2013 భూ సేకరణ చట్ట ప్రకారం 18 సంవత్సరాల నిండిన ప్రతి కుటుంబానికి 15 లక్షల ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాతారావు, కృష్ణ ,రాజు, సూరిబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.



సమ్మె నోటీస్ ఇస్తున్న నాయకులు, కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: జులై 9న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం మేనేజర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, జులై 9న దేశ వ్యాప్త సమ్మెకు కార్మిక లోకం సిద్ధం అవుతోందన్నారు. మూడోవ సారి అధికారం చేపట్టిన బిజెపి లేబర్ కోడ్స్ అమలుకు పూనుకొందని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇప్పటికే 8గంటల పనిదినాలను పెంచుతూ క్యాబినెట్ ఆమోదించిందని తెలిపారు.ఈ చర్యలు కార్మికులను బానిసత్వంకు నెట్టుతున్నాయని తెలిపారు. ఇప్పటికే కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొర్రా శ్రీను, లోవరాజు, బాబురావు, హేమంత్, అంజి పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతులకు మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.కోటేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఈ నెల 25న ఉదయం 10 గంటల వరకు విశాఖ కృష్ణాపురం గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఆ రోజు ఉదయం 9 గంట లకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. తరగతి సిలబస్, స్టాండర్డ్‌పై ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. అర్హులైన విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పిఎం సూర్య ఘర్‌పై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురంలో శుక్రవారం పీఎం సూర్య ఘర్ యోజన పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రసాద్ మాట్లాడుతూ, వ్యక్తిగత నివాసం, సామూహిక గృహ కామన్ సర్వీసులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యావరణానికి హాని చేయని సౌరశక్తి వాడకాన్ని ప్రజలంతా అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఇ అప్పారావు, ఏడి సునీల్, ఏఈ రాజేంద్రప్రసాద్, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, సర్పంచ్ సుజాత పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల పనులు ప్రారంభం

ప్రజాశక్తి- రావికమతం:ఎర్రవాయి ప్రాంతానికి 24 గంటలు కరెంటు అందించే దిశగా విద్యుత్ శాఖ పనులను ముమ్మరంగా చేపట్టినట్లు తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శుక్రవారం విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమణ మాట్లాడుతూ, తట్టబంద సబ్‌స్టేషన్ పరిధి తట్టబంద, గొంప, గుడ్డిప, తోటకూరపాలేం, కనిరెడ్డి పాలెం, తదితర గ్రామాలలో 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేస్తున్న సర్పంచ్



పట్టుబడిన ట్రాక్టర్లు

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి -కోటవురట్ల: మాకవరపాలెం మండలంలో శుక్రవారం మధ్యాహ్నం అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను రాచపల్లి సెంటర్ వద్ద పోలీసులు పట్టుకొని స్టేషన్కు తరలించారు, అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే ఉపేక్షించేది లేదని స్థానిక ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు.



సత్తాచాటిన టీం, (ఇన్‌సెట్‌లో మెడల్ చూపుతున్న గణేష్)

జాతీయ స్థాయి పోటీలో..

విభిన్న ప్రతిభావంత విద్యార్థి గణేష్ ప్రతిభ

ప్రజాశక్తి- రావికమతం: నేషనల్ లెవెల్ యూనిఫైడ్ వాలీబాల్ స్పెషల్ ఒలంపిక్స్ భారత్ క్రీడా పోటీలలో రావికమతం మండలానికి చెందిన మానసిక దివ్యాంగ విద్యార్థి బ్రాంజ్ మెడల్ సాధించడం జరిగిందని మేడివాడ జడ్పీ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈనెల 15 నుండి 19వ తేదీ వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రావికమతం మండలం దివ్యాంగ విద్యార్థి అప్పికొండ గణేష్ ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ తరపున వెళ్లిన టీం అద్భుతంగా ఆడి తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ ను గెలుపొందడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ టీమ్ లో అనకాపల్లి జిల్లా రావికమతం మండలం నుండి గణేష్ మొట్టమొదటిసారిగా మన ఆంధ్రప్రదేశ్ తరపున పోటీల్లో పాల్గొని విజయం సాధించడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో 19 రాష్ట్రాల నుండి 114 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో రావికమతం మండలానికి చెందిన విద్యార్థి మెడల్ సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. గణేష్ ను మండల విద్యాశాఖ అధికారులు తలుపులు, బ్రహ్మాజీ, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు , జగన్నాథ నాయుడు లు అభినందించారు.



చెక్కపై ఆసనాల ఆకృతి

సూక్ష్మ కళాకారుడు రవి ప్రతిభ

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి ఈనెల 21న శనివారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా తన సూక్ష్మ కళ ను ప్రదర్శించాడు. చెక్కపై ఇంగ్లీషులో యోగా అనే పదాన్ని , అదేవిధంగా వివిధ యోగ ఆసనాల ఆకృతిలను అద్భుతంగా తీర్చిదిద్దాడు.

నేటి నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి- నర్సీపట్నం:ఈనెల 21 నుంచి 28 వరకు పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. ఒకటి నుంచి 15 వేల ర్యాంకుల వరకు 21 తేదీన, 15 వేల నుంచి 32 వేల వరకు 28వ తేదీన, 32 వేల నుంచి 50 వేల వరకు 23వ తేదీన, 50 వేల నుంచి 68 వేల వరకు 24 వ తేదీన, 68 ఎనిమిది వేల నుంచి 86వేల వరకు 25వ తేదీన, 86 వేల నుంచి 1,04000 వరకు 26వ తేదీన, లక్ష నాలుగు వేల నుంచి 1,40,000 వరకు 27వ తేదీన, 1,20,000 దాటిన వారికి 28వ తేదీన సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తామని తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తేవాలని కోరారు.

వైసిపి గ్రామ కమిటీల ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆదేశాల మేరకు గొలుగొండ మండలం చిన్నయ్యపాలెం గ్రామపంచాయతీలో గ్రామ కమిటీ ఇన్చార్జ్ రాయపురెడ్డి హరీష్, గ్రామ సర్పంచ్ సింగంపల్లి నాయుడు ఆధ్వర్యంలో వైసిపి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పోతల వెంకునాయుడు, ఉపాధ్యక్షులుగా లగుడు సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సింగంపల్లి చిన్నయ్యనాయుడు, కొరుప్రోలు సత్యనారాయణ, మాకిరెడ్డి వరహాలబాబు, కార్యదర్శులుగా సింగంపల్లి త్రినాథ్, రావాడ చినబాబులు, ఉల్లి లోవ, బలిమి లోవరాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని కొంకసింగి గ్రామ పంచాయతీలో గ్రామ కమిటీ ఇన్చార్జ్ పరవాడ కవి, కసవరాజు సత్యనారాయణ, కసవరాజు బాబురావు, జీ.నాని ఆధ్వర్యంలో వైసిపి గ్రామ, అనుబంధ కమిటీలను ఎన్నికోవడం జరిగింది. గ్రామ యువజన విభాగం, గ్రామ మహిళా విభాగం, గ్రామ రైతు విభాగం అధ్యక్షులను ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొంకిపూడి రమణ, యువజన విభాగం అధ్యక్షులుగా పోలిపల్లి మల్లిబాబు, మహిళా విభాగం అధ్యక్షులుగా కసవరాజు మణి, రైతు విభాగం అధ్యక్షులుగా కసవరాజు పోతురాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.


సాఫీగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపిపి

ప్రజాశక్తి-నాతవరం :మండలం కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. ఎంపీపీ సాగిన లక్ష్మణ మూర్తి మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతిని వినిపించారు, అనంతరం సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామ సమస్యలపై మాట్లాడారు. తదనంతరం లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గ్రామ సమస్యలపై త్వరితగతిన స్పందించి పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, మండల పరిషత్ ఏవో పార్థసారథి, డిప్యూటీ తహసీల్దార్ రాజు, జెడ్పిటిసి కాపారపు అప్పలనరస, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఫీచర్ కశింకోట అనకాపల్లి



విద్యా కేంద్రాలుగా కశింకోట, అనకాపల్లి

◆ కార్పొరేట్‌కు ధీటుగా బోధన ◆ ఉత్తమ ఫలితాలు సాధన

ప్రజాశక్తి-కశింకోట:కశింకోట మండలం ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు ప్రైవేటు రంగంలో బడ్జెట్ పాఠశాలలకు నిలయంగా ఉంది. మండలంలో 9 జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు వున్నాయి. వాటిలో కశింకోట బాలికలు, బాలుర హైస్కూల్ విద్యార్థులు పది పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించారు. తేగాడలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థి ఈ ఏడాది రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతులు మీదగా ఆ బాలిక అవార్డు అందుకుంది. ఇంటిగ్రేటెడ్, మోడల్ బాలికల గురుకుల పాఠశాల కూడా ఈ ఏడాది మంచి ఉత్తీర్ణత సాధించింది. స్థానిక ఆర్ఇసిఎస్‌లో 4 బ్రాంచీలతో నెలకొల్పిన రాజీవ్ గాంధీ పాలటెక్నిక్ కళాశాల ద్వారా అనకాపల్లి రూరల్, కశింకోట, మునగపాక, పరవాడ, సబ్బవరం మండలాల్లోని విద్యుత్ వినియోగదారుల పిల్లలకు 50 శాతం సీట్లు కేటాయించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి డిప్లమా విద్యను ప్రభుత్వం అందిస్తోంది.



పలు ప్రైవేటు విద్యా సంస్థలు

కశింకోట మండలంలో పలు ప్రైవేటు విద్యా సంస్థలు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాయి. కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాల సువిశాలమైన భవనాలు, స్పోర్ట్స్ గ్రౌండ్ ఉన్నాయి. కరాటే, స్కేటింగ్ వంటి ప్రత్యేక శిక్షణ ఇక్కడ ఇవ్వడం జరుగుతుంది. స్థానిక వివేకానంద హైస్కూల్లో కరస్పాండెంట్ మళ్ల జగదీష్ ఆధ్వర్యంలో ఎల్‌కెజి నుండి 10 వరకు ఇంగ్లీష్, తెలుగు మీడియంలో ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు. బయ్యవరం ఆదర్శ పాఠశాల ఎల్‌కెజి నుండి 7వ తరగతి వరకు నడుస్తోంది. ఈ పాఠశాల కరస్పాండెంట్‌లు దేవర చిరంజీవి, గొల్లవిల్లి నానాజీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంలు గ్రామంలో చేస్తున్నారు.

తాళ్ళపాలెంలోని భార్గవి పాఠశాల విద్యార్థి చేబ్రోలు దీపిక ఈ ఏడాది పది ఫలితాల్లో 596 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం, జిల్లాలో రెండు స్థానం సాధించింది. పాఠశాల కరస్పాండెంట్ డి.రవి ఆధ్వర్యంలో మంది విద్యా బోధన సాగుతోంది. కన్నూరుపాలెంలో శ్రీగీత ప్రైమర్ హైస్కూల్ పేరున కరస్పాండెంట్ ఎస్.అన్నారావు ఆధ్వర్యాన నడుస్తోంది. ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పది ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించారు. నూతన గుండుపాలెంలో కింగ్స్ ఐడియల్ పాఠశాలలో విద్యార్థులకు పదో తరగతి వరకు విద్యా బోధన సాగుతోంది. నరసింగబిల్లిలో శ్రీఆధ్యా పాఠశాల ఎల్‌కెజి నుండి 7 వరకు కరస్పాండెంట్ కోన నాయుడు ఆధ్వర్యంలో నడుస్తోంది. శ్రీపూర్ణచంద్ర ప్రైమర్ హైస్కూల్‌లో పదో తరగతి వరకు విద్యా బోధన సాగిస్తున్నారు. శ్రీనిజ పాఠశాలలో 10వ తరతతి వరకు కరస్పాండెంట్ సేనాపతి నాయుడు ఆధ్వర్యంలో మంది విద్యా బోధన చేస్తున్నారు. తాళ్లపాలెంలో శ్రీగాయత్రి ప్రైమర్ హైస్కూల్‌లో ఈ ఏడాది పది తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపించిన కొల్లి మోహన్, సుగ్గు వెంకట్ ప్రభుత్వం ఇచ్చిన షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికయ్యారు.

అనకాపల్లి : అనకాపల్లి విద్యా సంస్థలకు నిలయం. 1886-87 సంవత్సరంలో 12 స్కూళ్లను అనకాపల్లి పట్టణంలో నెలకొల్పారు. ప్రస్తుతం జివిఎంసి ఉన్నత పాఠశాలగా ఉన్న పాఠశాలను 1856లో గవర్నమెంట్ తాలూకా స్కూల్‌గా స్థాపించారు. అనంతరం జిల్లా బోర్డు ఆధ్వర్యంలో అనేక పాఠశాలలు నెలకొల్పారు. అదే సమయంలో ఎయిడెడ్ పాఠశాలలు కూడా ఇక్కడ వెలిశాయి. ప్రధానంగా అనకాపల్లి వర్తక సంఘం ఆధ్వర్యంలో 1953లో ఎఎంఎఎ హైస్కూలు, ఎఎంఎఎల్ కళాశాలను నెలకొల్పారు. అవి ఎంతగానో ప్రసిద్ధి చెందాయి. గుడ్ షెఫర్డ్, బెతస్థా విద్యాసంస్థలు, ప్రశాంతి నికేతన్, సిటీ పబ్లిక్ స్కూల్, వాసవి బాలవిహార్ వంటి పలు ప్రైవేటు పాఠశాలలు వచ్చాయి. అలా వచ్చిన వాటిలో కొండ మాస్టర్ స్కూలు జాతీయ స్థాయిలో పేరుగాంచింది.